క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అరవింద్‌గౌడ్ మెడిసిన్ సీటు సాధించాడు. ఈ నేపథ్యంలో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో అరవింద్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు జ్ఞానేశ్వరి, ప్రతాప్‌గౌడ్ దంపతులకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, వెంకటస్వామిగౌడ్, గౌస్, శ్రీను, ఆనంద్‌గౌడ్, రాములు, రఫీ ఉన్నారు.

రోగుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: రోగుల ఆరోగ్యంపై వైద్యసిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం

అయిజ: సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేశారు. విధులు నిర్వహించడానికి వచ్చిన ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ కార్యాలయం బయట కూర్చొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

పౌష్టికాహారంపై అవగాహన

అయిజ: మండల కేంద్రంలోని ఉప్పరిపేటలో శనివారం అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చిట్టెమ్మ, ఈశ్వరమ్మ, విమల, ఏఎన్ఎం భాగ్యమ్మ ఉన్నారు.

వర్షం కోసం పూజలు



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం నుంచి డీ బూడిదపాడు శివారులోని ఆంజనేయస్వామికి కాడెద్దులతో భక్తులు స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బైరాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

గద్వాల: చేతి, కులవృత్తుల వారి జీవితాలలో వెలుగు నింపే విశ్వకర్మ యోజన పథకానికి ప్రధాని నరేంద్రమోదీ శ్రీకారం చుడుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహ తెలిపారు. శనివారం బీజేపీ నాయకులు 'ధన్యవాద్ మోదీజీ' పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రాపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, దేవదాసు ఉన్నారు.

బీజేపీలో చేరిక

గద్వాల: ధరూర్ మండలం పారుచర్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. శనివారం వారికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నాయకులు బస్వరాజు, నవారన్న, వెంకటేష్, కుర్మన్న, స్వామి, గణేష్, లాజర్, బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యన్న, నవారన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



మానవపాడు: మండలంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓటర్ల చైతన్యం కోసం కళాశాల ప్రిన్స్‌పాల్ పద్మావతి ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతి అందజేత

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవికి మట్టి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు



ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

గద్వాల క్రైం: బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం గద్వాల డిపో నుంచి 80 బస్సులను బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రభుత్వం అద్దెకు తీసుకున్నది. దీంతో జిల్లా నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణిలకు బస్సు సర్వీసులు లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేట్ వాహనాలు సీఎం సభకు వెళ్లడంతో ఆటోలు ఇతర వాహనాలపై ప్రయాణికులు వెళ్లాల్సి వచ్చింది. గద్వాల డిపోకు 125బస్సులుండగా, 80బస్సులు సీఎం సభకు వెళ్లాయి. 45బస్సులు ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ మాత్రమే దూర ప్రాంతాల ప్రయాణిలకు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు స్కూల్ బస్సులను సీఎం సభకు అద్దెకు తీసుకెళ్లడంతో విద్యార్థులు సైతం పాఠశాలలకు సొంత వాహనాలపై తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని గ్రామాల్లో ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంతమంది భక్తులు స్వామి వారికి దాసంగం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్



సబ్‌డీలర్లకు గిఫ్ట్ ప్యాకెట్లు అందజేస్తున్న సతీష్‌కుమార్, రంగస్వామి

గద్వాలన్యూటౌన్: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ మారు పేరని ఆ సంస్థ మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీరంగస్వామి ట్రేడర్స్ ఆధ్వర్యంలో సబ్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలను వివరించారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం అవుతుందన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో సంస్థకు చెందిన నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి వినియోగదారులకు, మేస్త్రీలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించి సహాయపడతారని చెప్పారు. భారతిసిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉంటుందని వివరించారు. యాదాద్రి నిర్మాణానికి, ఆలేరు–వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణాలకు భారతి సిమెంట్ వినియోగించడం గర్వకారణమన్నారు. అనంతరం సబ్ డీలర్లకు గిఫ్టులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి విజయ్‌బాబు, డీలర్ రంగస్వామి, శ్రీనివాసులు, సబ్‌డీలర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

చదువుతో అన్నీ సాధ్యం



డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న రంజిత్‌కుమార్, ధనలక్ష్మి

గట్టు: చదువుతోనే అన్నీ సాధ్యమని, తమ పిల్లలను పాఠశాలకు పంపి చదివించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గట్టులోని ప్రాథమిక పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదిని శనివారం ఆయన, సర్పంచ్ ధనలక్ష్మిలు ప్రారంభించారు. టీచ్ ఫర్ చేంజ్ అనే సంస్థ విద్యార్థులకు సులభంగా ఇంగ్లిష్ బోధన చేయడానికి డిజిటల్ తరగతి గదిని ఏర్పాటు చేసిందన్నారు. సంస్థ 30 ప్రాథమిక పాఠశాలలను దత్తత తీసుకుని డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో విజ్ఞానులైన ఓటర్లుగా, నాయకులుగా, పాలకులుగా మారే అవకాశం నేటి విద్యార్థులకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాగేష్‌యాదవ్, వీరేష్, బలరాం, దయాకర్, అవనిశ్రీ, లవన్న, వెంకట్రాములు, విష్ణు, తిమ్మప్ప, లక్ష్మన్న, ప్రేమ్‌రాజ్, భీమన్నగౌడు, అంజి, దస్తగిరిగౌడు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యాధికారులు

గద్వాల: జాతీయ సైన్స్ సెమినార్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు డీఈఓ సిరాజుద్దీన్ బహుమతులు అందజేశారు. శనివారం బాలభవన్‌లో 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్, డైట్ ప్యాడ్' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 8–10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అశ్రిత ప్రథమ స్థానంలో నిలిచింది. అలంపూర్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని స్పందన ద్వితీయ స్థానంలో, ధరూర్ కేజీబీవీకి చెందిన జ్ఞానేశ్వరి తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు హరిబాబు, నాగేంద్ర, ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

వర్గీకరణను సాధించుకుందాం



గట్టులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గట్టు: కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎస్సీ వర్గీకరణ బిల్లును సాధించుకుందామని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, తీన్మార్ మల్లన్న టీం జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము ప్రవీన్‌లు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, బీజేపీ ప్రభుత్వం చెబుతూ వస్తోందని, ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బల్గెర మాజీ సర్పంచ్ సామేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇమ్మానియేలు, ముక్కెరన్న, బండారి డేవిడ్, ఏసు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల నిరసన



దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు వివిధ సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. 13వ రోజు సైతం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. శిబిరంలోని ఉద్యోగులు బెలూన్లపై డిమాండ్లను రాసి రోడ్డుపై వెళ్లే వారికి అందజేసి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామాంజనేయులు, యువరాజు, నర్సింహ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

అయిజ: పాలమూరు–రంగారెడ్డి పేరుతో మరొకసారి ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలను మోసం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, శేఖర్,నరసింహయ్య శెట్టి, నాగరాజు, భగత్‌రెడ్డి, అంజి ఉన్నారు.

కేటీదొడ్డి: సీఎం సభకు అడ్డుపడ్తారనే నేపథ్యంలో బీజేపీ నాయకులను, కార్యకర్తలను కేటీదొడ్డి పోలీసులు జ్యోతికాంత్ ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మహదేవ్, జంగిలప్ప, తిరుపతి, నర్సప్ప ఉన్నారు.

శాంతినగర్: కొల్లాపూర్‌లో సీఎం కేసీఆర్ సభ సందర్భంగా బీజేపీ నాయకులను ముందస్తు శాంతినగర్ పోలీసులు అరెస్ట్ చేసి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, దశరథం సాగర్, రాజేష్, ఉన్నారు.

గట్టు: సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూలు, కొల్లాపూర్ పర్యటన నేపథ్యంలో చిన్నోనిపల్లె నిర్వాసితులను ముందస్తుగా కొందరిని అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల్లా ప్రభుత్వ ఉద్యోగులు



మాట్లాడుతున్న శేఖర్

అయిజ: ప్రజల సొమ్ముతో ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు బీఆర్ఎస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయన్న ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తికాకుండానే సీఎం కేసీఆర్ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజు, రవీందర్ పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రభుత్వ ఉద్యోగులు బీఆర్ఎస్ కార్యకర్తల్లా పనిచేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు సేవలు చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు కొల్లాపూర్‌లోని సీఎం కేసీఆర్ బహిరంగ సభకు గ్రామ పంచాయతీ సిబ్బందిని, మహిళా సంఘాల వారిని బస్సుల్లో తరలించడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రుక్మానందరెడ్డి, దేవేంద్ర, నాగరాజు, చిన్నిబాబు, కుమార్ పాల్గొన్నారు.

సహఉద్యోగిపై దాడికి యత్నం

మానవపాడు: రెవెన్యూ కార్యాలయం ఉద్యోగులు ఒకనొకరు మాటలతో బహబహికి దిగారు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మానవపాడు మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు లిస్ట్‌కు సంబంధించి ఈ నెల 19వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయంలోని ఓ గదిలో బీఎల్ఓలుండగా, ఆ గదిలోకి సూపర్‌వైజర్ సీనియర్ అసిస్టెంట్ సర్దార్‌మియ్య వెళ్లారు. బీఎల్ఓలతో పని ఎంత వరకు పూర్తి చేశారని అడగగా, అదేగదిలో ఉన్న ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి 'ఒరేయ్ గది నుంచి వెళ్లారా' అని గద్దించినట్లు సర్దార్‌మియ్య ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఒకరినొకరు దూసించుకుంటూ గొడవకు దిగారు. కట్టె తీసుకొని కొట్టడానికి ఆర్ఐ యత్నించాడు. అక్కడున్న అధికారులు కలుగజేసుకొని గొడవను ఆపారు. ఈ ఘటనపై తహసీల్దార్‌ను వివరణ కోరగా, కార్యాలయంలో చిన్నచిన్న గొడవలు జరుగుతుంటాయని, మరోసారి ఇలాంటి పునరావృతం కాకుండా చూస్తానని తెలిపారు.

నీలహళ్లిలో వివాహిత అదృశ్యం

ధరూరు: వివాహిత అదృశ్యమైన ఘటన శనివారం మండల పరిధిలోని నీలహళ్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. నీలహళ్లికి చెందిన జయలక్ష్మి పిట్టల పర్శ భార్యాభర్తలు. శనివారం తెల్లవారు జామున ఇంటి నుంచి ఆమె వెళ్లిపోయింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గతంలో ఇలాగే ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి డీకే అరుణ పరామర్శ

ధరూరు: మండల పరిధిలోని మార్లబీడు గ్రామానికి చెందిన అశ్రోదమ్మ(50) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధితులకు ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట గడ్డం కృష్ణారెడ్డి, బల్లం జనార్దన్‌రెడ్డి, కురువ కిష్టన్న ఉన్నారు.

మినీ డీసీఎం బోల్తా : తప్పిన ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారి 44పై టైర్ ఉడిపోయి మినీ డీసీఎం బోల్తా పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూల్ వైపు నుంచి పెబ్బేర్‌కు తడకల లోడ్‌తో మినీ డీసీఎం వస్తోంది. మానవపాడు శివారులో వెనుక వైపు ఉన్న టైర్ ఉడిపోయి డీసీఎం బోల్తా పడింది. డ్రైవర్ రాజు, క్లినర్ రాజారావులకు ఎటువంటి ప్రమాదం కాలేదు.

పట్టపగలే చోరీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న దుబ్బన్న శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన సందపోగు రాము వారి ఇంటి తాళాన్ని బద్దలుగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.20వేల నగదు చోరీ చేశాడు. ఆ సమయంలో అతని చూసిన స్థానికులు బాధితుడికి సమాచారం అందించారు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడు

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన మైనర్‌పై (5వ తరగతి)పై వృద్ధుడు(60) అసభ్యంగా ప్రవర్తించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు ఈ నెల 13న బీడీలు తీసుకురావాలని డబ్బులిచ్చి బాలికను పంపాడు. దుకాణం వెళ్లిన బాలిక బీడీ తీసుకరాగా, ఇంట్లోకి తీసుకెళ్లి బలవంతం చేయబోయాడు. అతని చేతిని కొరికి బాలిక తప్పించుకుంది. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వృద్ధుడితో గొడవ పడ్డారు. పరువు కోసం ఈ విషయం దాచడంతో బాలిక వృద్ధుడిని చూసి భయపడుతోంది. దీంతో వృద్ధుడిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి



బస్టాండ్ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల క్రైం: గద్వాల ఆర్టీసీ బస్టాండు నిర్మాణం పనులు గడువులోపు పూర్తి చేసి ప్రయాణిలకు అందుబాటులో తేవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం బస్టాండు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. బస్టాండు ఆధునీకరణకు ప్రభుత్వం రూ.2కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా ఇంజనీర్లు రూపొందించారన్నారు. 14ప్లాట్‌ఫాంలు, వేచి ఉండే గదులు, ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండే సమయాల్లో కుర్చీలు తదితర సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిపై తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కేశవ్ ఉన్నారు.

సభలపై ఉన్న ధ్యాస ప్రజలపై ఉండదు



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: పాలకులకు బహిరంగ సభలపై ఉన్న ధ్యాస ప్రజలపై ఉండదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ హాజరువుతున్నారని నియోజకవర్గంలోని ప్రతిపల్లెకు ఆర్టీసీ బస్సులు పంపించారన్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదన్నారు. కానీ ప్రభుత్వం కొల్లాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులతో జనాలను తరలించారన్నారు. ప్రజలను మభ్యపెట్టి బహిరంగ సభకు జనాలను తరలించారని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మద్దిలేటి, కృష్ణ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ కార్యాలయం ముందు వివిధ గ్రామాల వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. బిల్లుల చెల్లింపులో జాప్యానికి నిరసనగా వంట ఏజెన్సీలు పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్ చేసి ఆందోళన బాట పట్టారు. అప్పులు చేసిన విద్యార్థులకు భోజనం పెట్టలేమని నిర్వాహకులు తెలిపారు. దీనికి తోడు రాగి జావ, అల్పాహారం అంటూ కొత్త వాటిని తీసుకొస్తున్నట్లు వారు వాపోయారు. పెండింగ్ బిల్లులు, కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



గట్టు నుంచి తరలి వెళ్తున్న నాయకులు



కొల్లాపూర్ సభకు బయలుదేరిన నాయకులు

కేటీదొడ్డి: నాగర్‌కర్నూల్ జిల్లాలో పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం కేసీఆర్ సభకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్సులల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల నాయకులు హనుమంతు, గోవిందు, నసీరుద్దీన్, యుగంధర్, వీరేష్, తాయప్ప పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్సులు, వాహనాల ద్వారా సభకు వెళ్లారు.

అలంపూర్: నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

గట్టు: సీఎం కేసీఆర్ సభను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు తరలి వెళ్లారు. గట్టులో బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

జల సాధకుడు కేసీఆర్..

ధరూరు: కరువుకు పుట్టినిల్లు అయిన పాలమూరులో నేడు అన్ని ప్రాంతాలకు సాగు నీటిని తీసుకొచ్చి సస్యశ్యామలం చేసిన ఏకైక నాయకుడు, జల సాధకుడు కేసీఆర్ అని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్‌లు అన్నారు. సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో దర్శెల్లి, రఘువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, విజయ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, తిరుమల్ నాయుడు, రంగన్న, సురేష్, రాముడు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com